## ఇస్రో మరో భారీ ప్రయత్నం.. బాహుబలి రాకెట్ ప్రయోగం

నెల్లూరు, సతీశ్ థావన్ అంతరిక్ష పరిశోధన కేంద్రం మరో ప్రయోగానికి సిద్ధమైంది. ఈ నెల 24వ తేదీన మరో అతిపెద్ద బాహుబలి రాకెట్ ప్రయోగానికి ముహూర్తం ఖరారు చేశారు. 24న ఉదయం 8:54గంటలకి బాహుబలి రాకెట్‌ను నింగిలోకి ప్రయోగించనున్నారు. ఈ రాకెట్ ఎత్తు - 43.5మీటర్లు, బరువు 6400 మీటర్లు ఉండగా.. ఈ రాకెట్ ప్రయోగ సమయం 15నిమిషాల 7 సెకన్లు ఉండనుంది. అమెరికాకు చెందిన బ్లూ బార్డ్ బ్లాక్ - 2 శాటిలైట్‌ని నింగిలోకి మోసుకెళ్లనుంది బాహుబలి రాకెట్. శాటిలైట్ బరువు 6100కిలోలు ఉంది. ఈ శాటిలైట్‌ని అమెరికాకి చెందిన స్పేస్ మొబైల్ సంస్థ రూపొందించింది. గతంలో పంపిన శాటిలైట్ల కంటే పదిరెట్లు అధిక సామర్థ్యంతో బ్లూ బార్డ్ బ్లాక్ - 2 శాటిలైట్ పనిచేయనుంది. ఎల్‌వీఎం రాకెట్ సిరీస్‌లో ప్రస్తుతం ఎనిమిదో ప్రయోగం జరగనుంది. ఇప్పటి వరకు జరిగిన ఏడు ప్రయోగాలు విజయవంతమైన విషయం తెలిసిందే. చంద్రయాన్ -3 ప్రయోగానికి ఎల్‌వీఎం-3 రాకెట్‌ని ఇస్రో వినియోగించనుంది.

# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి  సంపుటి: 10 సంచిక :258  ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్  తేది: బుధవారం 24-12-2025  పేజీలు:4 వెల: 2.00

## పీవీ వర్ధంతి సందర్భంగా కేటీఆర్ నివాళులు



హైదరాబాద్,తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహా రావు భారతదేశానికి గర్వకారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. భారత ప్రధానిగా, ఆర్థికవేత్తగా, రాజనీతిజ్ఞుడిగా, సంస్కరణశీలిగా, బహుభాషా కోవిదుడిగా భారతరత్న పీవీ అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా ఆయన ట్విట్టర్ (ఎక్స్) వేదికగా నివాళులర్పించారు. ఆధునిక భారత నిర్మాణానికి బాటలు వేస్తూ.. పీవీ నరసింహా రావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు చరిత్రాత్మకమని కేటీఆర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత.. పీవీ నరసింహా రావును బీఆర్ఎస్ ప్రభుత్వం సముచితంగా గౌరవించిందని గుర్తుచేశారు. పీవీ నరసింహా రావు శత జయంతి ఉత్సవాలను కేసీఆర్ ప్రభుత్వం ఘనంగా నిర్వహించిందని.. నెక్లెస్ రోడ్‌కి, వెటర్నరీ యూనివర్సిటీకి పీవీ పేరు పెట్టింది.. వారి విగ్రహాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. పీవీ నరసింహా రావుకి భారతరత్న ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం తరఫున కేంద్ర ప్రభుత్వానికి తీర్మానం పంపిందన్నారు. పీవీ కూతురిని ఎమ్మెల్సీగా గౌరవించిందన్నారు.

చెక్‌డ్యామ్‌లను పేల్చేయడంపై కేటీఆర్ ఫైర్

తెలంగాణలో నడుస్తోంది ప్రజా పాలన కాదు.. "పక్కా మాఫియా పాలన" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. నాడు ఎన్నికల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు మీద బాంబులు వేశారని.. నేడు ఇసుక మాఫియా కోసం ఏకంగా చెక్ డ్యామ్‌ల మీద జెలటిన్ స్టిక్స్‌తో బాంబులు వేస్తున్నారని మండిపడ్డారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వాటర్ మ్యాన్ రాజేంద్ర సింగ్ "ఇది మానవ నిర్మిత విధ్వంసం" అని మొత్తుకుంటున్నా, ఈ 'చిట్టి నాయుడి' ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదని అన్నారు. డ్రిల్లింగ్ మెషీన్లతో హోల్స్ చేసి, జెలటిన్ స్టిక్స్ పెట్టి పేల్చారని ఆయన సాక్ష్యాలతో సహా నిరూపించారని అన్నారు. ఇసుకను దోచుకోవడానికి అడ్డుగా ఉన్నాయని, కోట్ల రూపాయల ప్రజా ధనంతో కట్టిన చెక్ డ్యామ్‌లను డైనమైట్లు పెట్టి పేల్చేస్తారా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఇది ప్రభుత్వమా లేక గ్యాంగ్ స్టర్ల అడ్డాయా అని నిలదీశారు. భూగర్భ జలాలు పెరగాలని మేం చెక్ డ్యామ్‌లు కడితే.. వాటిని కూల్చివేసి రైతుల పొలాలను ఎడారిగా మారుస్తున్నారని మండిపడ్డారు. మీ ఇసుక కాంట్రాక్టర్ల లాభాల కోసం తెలంగాణ రైతాంగం బలి కావాలా అని ప్రశ్నించారు. ప్రకృతి వైపరీత్యం వల్ల కూలిపోయాయని కట్టుకథలు అల్లిన కాంగ్రెస్ మంత్రులకు రాజేంద్ర సింగ్ గారి రిపోర్ట్ చెంపపెట్టు అని కేటీఆర్ అన్నారు. ఇప్పుడు మీ సమాధానం ఏంటి రేవంత్ రెడ్డి అని ప్రశ్నించారు. అభివృద్ధి చేయడం చేతకాదు కానీ, ఉన్న ఆస్తులను కూల్చడంలో మీరు సిద్ధహస్తులని విమర్శించారు. తెలంగాణ ఆస్తులపై బాంబులు వేస్తున్న మాఫియా వెనుక ఉన్న అసలు దొంగలను బయటపెట్టండని డిమాండ్ చేశారు. రాజేంద్ర సింగ్ డిమాండ్ చేసినట్లు పీపుల్స్ ఎంక్వైరీ కమిషన్ వేయాల్సిందేనని డిమాండ్ చేశారు. లేదంటే ఈ బాంబుల సెగ మీ కుర్చీ దాకా రావడం ఖాయమని హెచ్చరించారు.

## రాజకీయ లబ్ధి కోసం కేసీఆర్ పచ్చి అబద్ధాలు : డీకే అరుణ



పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో మాజీ సీఎం కేసీఆర్ పచ్చి అబద్ధాలు మాట్లాడారని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ అన్నారు. తన నివాసంలో డీకే అరుణ మీడియా సమావేశంలో మాట్లాడుతూ పదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన విషయం కూడా మరచిపోయి, రాజకీయ లబ్ధి కోసం సెంటిమెంటును రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. దశాబ్దం పాటు ముఖ్యమంత్రిగా పాలమూరు జిల్లా కు ఏం ఒరగబెట్టారని ప్రశ్నించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు డిజైన్లను మీరు ఎందుకు మార్చారు? జూరాల నుంచి నీటిని తీసుకోవాలని రిటైర్డ్ ఇంజనీర్లు సిఫారసు చేసినా, మేము పదే పదే విజ్ఞప్తి చేసినా ఎందుకు పట్టించుకోలేదు. జూరాల ప్రాజెక్టు లో నీళ్లెక్కడ ఉన్నాయని నాడు సీఎంగా మీరు ప్రశ్నించలేదా? కృష్ణా జలాల్లో తెలంగాణకు 535 టీఎంసీల వాటా రావాల్సి ఉండగా, 299 టీఎంసీలకే అంగీకరించి అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో సంతకం చేసిన మాట వాస్తవం కాదా? అని నిలదీశారు. ఆనాడు బీఆర్ఎస్ ప్రభుత్వం పూటకో డీపీఆర్ పంపించిందన్నారు. అది తప్పుల తడకగా ఉండడంతో సరిచేసి పంపించాలని కేంద్రం సూచించి ఉండవచ్చని పేర్కొన్నారు. కృష్ణా పరివాహక ప్రాంతంలోని ప్రాజెక్టులను కేసీఆర్ పూర్తిచేయకపోవడం వల్లే కృష్ణా జలాల్లో వాటాను కూడా వినియోగించుకోలేకపోయామని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీఆర్ఎస్ బాటలోనే నడుస్తోందని, బీజేపీని అధికారంలోకి రాకుండా అడ్డుకోవడానికి ఆ రెండు పార్టీలు కుట్ర పన్నాయని ఆరోపించారు. ఆస్తి, కుర్చీ కొట్లాటలతో రోడ్డుపైకి వచ్చి మాట్లాడితే నమ్మడానికి ప్రజలు పిచ్చివాళ్లు కాదన్న విషయాన్ని ఎమ్మెల్సీ కవిత గుర్తుంచుకోవాలన్నారు.

## కేసీఆర్ స్టేట్స్‌మెన్‌లా మాట్లాడితే.. రేవంత్‌రెడ్డి స్ట్రీట్ రౌడీలా మాట్లాడారు



హైదరాబాద్ : కేసీఆర్ ఆదివారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడిన మాటలపై రేవంత్ రెడ్డి చిట్‌చాట్‌లో స్పందించిన తీరును బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు తప్పుపట్టారు. తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. కేసీఆర్ ఒక స్టేట్స్‌మెన్‌లా మాట్లాడితే.. రేవంత్ రెడ్డి స్ట్రీట్ రౌడీలా మాట్లాడారని విమర్శించారు. ఓ గల్లీ రౌడీ మాటల్లా, ఓ గూండా మాటల్లా రేవంత్‌రెడ్డి మాటలు ఉన్నాయని విమర్శించారు. తెలంగాణకు ఒక నొక్కుపడనియ్యను అని కేసీఆర్ చాలా గొప్పగా మాట్లాడారని, ఆ మాటతో సీఎం రేవంత్‌రెడ్డికి, నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి వచ్చిన నొప్పి ఏమిటో అర్థం కావడం లేదని హరీశ్ రావు అన్నారు. తప్పు చేసింద్రు కాబట్టే వాళ్లకు నొప్పి కలుగుతున్నదని వ్యాఖ్యానించారు. ఉత్తమ్ కుమార్‌రెడ్డి నిన్న ఉత్తరకుమారుడిగా తేలిపోయారని ఎద్దేవా చేశారు. ఆసరా పింఛన్‌లను రూ.4 వేలకు పెంచుతామని ఎందుకు పెంచలేదని కేసీఆర్ ప్రశ్నించారని, దానికి మీరు ఎందుకు సమాధానం చెప్పలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి అపారమైన అనుభవం ఉన్నదని, నిధులు ఎలా సమీకరించాలో, ప్రజలకు ఎలా ఇవ్వాలో బాగా తెలుసని ఎన్నికల ముందు చెప్పింద్రు కదా.. ఇప్పుడు ఏమైంది మీ అనుభవం అని హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. మీ అనుభవం అంతా దోపిడీలకు, కమిషన్‌లకు, వాటాలకు, లూటీలకే సరిపోయిందా..? అని ప్రశ్నించారు. 'బీఆర్ఎస్ హయాం లో ఆటో డ్రైవర్‌కు ఫోన్ చేస్తే యూరియా బస్తాలు తెచ్చి ఇంట్లో వేసి వెళ్లేవారని, ఇప్పుడు చెప్పులు లైన్‌లో పెట్టే పరిస్థితి వచ్చిందని, యాప్‌లు, మ్యాప్‌లతో రైతులను ఎందుకు గోసపెడుతున్నరు' అని కేసీఆర్ ప్రశ్నించారు. దానికి మీ సమాధానం ఏదీ అని హరీశ్‌రావు క్వశ్చన్ చేశారు. హైదరాబాద్ నగర శ్రేయస్సు కోసం తాము పార్మాసిటీ కోసం కేటాయించిన స్థలంలో ఇప్పుడు ఫ్యూచర్ సిటీ ఎందుకు అంటున్నారని కేసీఆర్ అడిగిన ప్రశ్నకు సీఎం నుంచి సమాధానం లేదని హరీశ్‌రావు మండిపడ్డారు. కేసీఆర్ రాష్ట్ర ప్రయోజనాల గురించి, హైదరాబాద్ శ్రేయస్సు గురించి మాట్లాడితే.. రేవంత్ రెడ్డి అంతా సొల్లు మాట్లాడారని విమర్శించారు. 'కేసీఆర్ హయాంలో ఆర్థిక అరాచకత్వం సాగింది' అన్న సీఎం రేవంత్ రెడ్డి మాటలపై కూడా మాజీ మంత్రి మండిపడ్డారు. ఇటీవల జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో నువ్వు ఆహ్వానించిన ప్రముఖులే తెలంగాణ ఆర్థిక ప్రగతిని కొనియాడారని హరీశ్‌రావు గుర్తుచేశారు. బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్, ఆర్బీఐ గవర్నర్ సుబ్బారావు మాట్లాడిన మాటలను రేవంత్ రెడ్డి ఒకసారి వీడియో పెట్టుకుని చూడాలని సూచించారు. కొత్త రాష్ట్రమైనా తెలంగాణ అద్భుతమైన ఆర్థిక ప్రగతిని సాధించిందని, మూడు రెట్ల జీఎస్‌డీపీని సాధించిందని, మూడు రెట్ల తలసరి ఆదాయం పెరిగిందని వారు కేసీఆర్ పాలనను మెచ్చుకున్న విషయాన్ని గుర్తుచేశారు.

## బంగ్లాదేశ్‌కు సర్జరీ అవసరం...



అస్సాం: పొరుగుదేశం బంగ్లాదేశ్‌ను ఉద్దేశించి అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ కీలక వ్యాఖ్యలు చేశారు. బంగ్లాతో దౌత్యానికి సమయం దాటిపోయిందని, ఇక శస్త్రచికిత్స అవసరమన్నారు. జాతీయ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు."వ్యూహాత్మకంగా కీలకమైన చికెన్స్ నెక్ గురించే ఆందోళన అంతా. దౌత్యం, ఇతరమార్గాల ద్వారా 20-22 కి.మీ భూభాగాన్ని భారత్ కాపాడుకోవాల్సి ఉంది. ఔషధాలు విఫలమైనప్పుడు, శస్త్రచికిత్స అవసరం" అని హిమంత వ్యాఖ్యలు చేశారు. బంగ్లాదేశ్ లో ఉద్రిక్తతలు చోటుచేసుకుంటున్న తరుణంలో ఈవిధంగా స్పందించారు. బంగ్లా తాత్కాలిక సారథి మహమ్మద్ యూనస్ గతంలో చైనా పర్యటన సందర్భంగా ఈ చికెన్స్ నెక్ గురించి అనుచిత వ్యాఖ్యలు చేశారు. "భారత ఈశాన్య ప్రాంతంలోని ఏడు రాష్ట్రాలను సెవెన్ సిస్టర్స్ అంటారు. అవి బంగ్లాదేశ్‌తో భూపరివేష్టితమై ఉన్నాయి. వారు సముద్రానికి చేరుకోవడానికి వేరే మార్గం లేదు. ఈ ప్రాంతంలో సముద్రానికి మేమే రక్షకులం. కాబట్టి ఇది భారీ అవకాశం. చైనా ఆర్థిక బేస్‌ను విస్తరించుకోవడానికి అనుకూలంగా ఉంటుంది'' అని నోరు పారేసుకున్నారు. చికెన్స్ నెక్ కారిడార్ . పశ్చిమబెంగాల్‌లోని సిలిగురి భూభాగంలో ఇది ఉంటుంది. '7 సిస్టర్స్'గా పిలిచే 7 ఈశాన్య రాష్ట్రాల (అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, త్రిపుర)ను భారత ప్రధాన భూభాగంతో ఈ కారిడార్ కలుపుతోంది. ఈ ప్రాంతంలో కొంతభాగం కేవలం 22 కిలోమీటర్ల వెడల్పు ఉంది. నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్‌లకు అతి దగ్గర్లో ఉంది. చైనా అధీనంలోని చుంబీలోయ దీనికి అత్యంత సమీపంలో ఉంది. ఈ ప్రదేశంపై దాడి చేసి భారత్ నుంచి ఈశాన్య రాష్ట్రాలను వేరు చేసే ప్రమాదం ఉందని సైనిక వ్యూహకర్తలు కొన్ని దశాబ్దాలుగా ఆందోళన చెందుతున్నారు. ఇదే జరిగితే ఈశాన్య ప్రాంతాల్లోని సైనిక దళాలకు సరఫరాలు కష్టమైపోతాయి. డోక్లాం ట్రై జంక్షన్ వద్ద చైనా రోడ్డు నిర్మాణాలను భారత్ దళాలు అడ్డుకోవడానికి గల ప్రధాన కారణాల్లో ఇది కూడా ఒకటి. డోక్లాం ప్రాంతం తమదేనంటూ డ్రాగన్ వాదిస్తూ వస్తోంది. ఈ విషయమై 2017లో భారత్-చైనా ల మధ్య 72 రోజుల పాటు ప్రతిష్టంభన నెలకొంది.

## బంగ్లాదేశ్‌లో హింస.. ఆందోళన వ్యక్తం చేసిన ఐక్యరాజ్యసమితి



న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లో చోటుచేసుకుంటున్న హింస పట్ల యూఎన్ సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ ఆందోళన వ్యక్తం చేశారు. హిందూ వ్యక్తిని కొట్టి చంపిన ఘటన పట్ల ఆయన రియాక్ట్ అయ్యారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న హింసాత్మక ఘటనలు ఆందోళన కలిగిస్తున్న విషయం వాస్తవమే అని యూఎన్ సెక్రటరీ జనరల్ ప్రతినిధి స్టీఫెన్ దుజారిక్ తెలిపారు. ప్రెస్ మీట్‌లో ఆయన ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్‌లో మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయన్న అంశంపై స్పందన కోరగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బంగ్లాదేశ్ అయినా మరే ఇతర దేశమైనా, మెజార్టీకి చెందని ప్రజలు సురక్షితంగా ఉండాలని, బంగ్లాదేశీయులందరూ సేఫ్‌గా ఉండాలని, దేశంలోని ప్రతి పౌరుడు సురక్షితంగా ఉండేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని విశ్వాసంతో ఉన్నట్లు దుజారిక్ తెలిపారు. బంగ్లాదేశ్‌లోని అనేక మీడియా సంస్థలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మీడియా సంస్థలను టార్గెట్ చేయడంలో తమ జీవన హక్కు ప్రమాదంలో పడినట్లు బంగ్లా జర్నలిస్టులు ఆరోపించారు. బంగ్లా మీడియా ప్రస్తుతం దీన అవస్థలో ఉన్నదని, భావస్వేచ్ఛను హరించారని జర్నలిస్టులు పేర్కొన్నారు. ఢాకాలో ఉన్న ప్రోతమ్ ఆలో, ద డెయిలీ స్టార్ వార్తాపత్రికల ఆఫీసులకు నిప్పు పెట్టిన ఘటన నేపథ్యంలో పలువురు ఎడిటర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఆఫీసులకు నిప్పుపెట్టిన సమయంలో చాలా మంది జర్నలిస్టులు లోపలే చిక్కుకుపోయారని, పోలీసులు.. ఫైర్ సర్వీసులను రాకుండా అడ్డుకున్నారని ఎడిటర్లు ఆరోపించారు. భావస్వేచ్ఛ ఇప్పుడో సమస్య కాదు అని, అసలు బ్రతికి ఉండడమే ఇప్పుడు సమస్యగా మారినట్లు డెయిలీ స్టార్ ఎడిటర్ మహఫూజ్ ఆనమ్ తెలిపారు.

## గులాబీ సారూ ఏం చేస్తారూ ?



హైదరాబాద్,కేసీఆర్ ఆషామాషీ నాయకుడు కాదు, చిన్న స్థాయి నుంచి ఎదిగి తన గొంతుకతో జాతీయ రాజకీయాలను ఒక దశలో శాసించారు. పార్లమెంట్ అజెండాను తీర్మానాలను కూడా ఆయన ప్రభావం చూపించగలిగారు. తెలంగాణా అన్న ఒక ఇష్యూతోనే కొన్నాళ్ళ పాటు దేశంలోని జాతీయ ప్రాంతీయ పార్టీలను తన వైపునకు తిప్పుకున్నారు వారి మేనిఫెస్టోలో సైతం తెలంగాణా రాత గీత జాగ్రత్తగా ఉండేలా చూశారు. ఇక తెలంగాణా తెచ్చాక రెండు సార్లు సీఎం అయ్యాక కేసీఆర్ వైఖరి మారింది అని అప్పట్లో విమర్శ. ఆయన పెద్దగా ఎవరినీ కలవకుండా గ్యాప్ పాటించారు అని చెబుతారు. దాంతో ఆయన 2023లో ఓటమి పాలు అయ్యారు. ఇక ఓడిన తరువాత కూడా రెండేళ్ళ పాటు జనంలోకి రాకుండా కేరాఫ్ ఎర్రవెల్లి ఫాం హౌస్ గా ఉండిపోయారు. అసెంబ్లీకి సైతం కేసీఆర్ రాని సందర్భం ఉంది.

బిగ్ సౌండ్ చేసినా :

అటువంటి కేసీఆర్ బిగ్ సౌండ్ చేశారు. చాలా కాలం తరువాత ఆయన తెలంగాణా భవన్ కి వచ్చారు మీటింగ్ పెట్టారు ఉత్సాహ పూరితంగా మాట్లాడారు, మీడియా ముందుకు వచ్చి ఎంతో ఆవేశపూరితంగా మాట్లాడారు, ఇక మీదట తాను అందరికీ అందుబాటులో ఉంటాను అని కూడా మీడియా ముఖంగా పార్టీకి చెప్పారు. ఏకంగా మూడు సభలను ఏర్పాటు చేయమని కూడా పురమాయించారు. అయితే కేసీఆర్ ఇంత చెప్పినా ఇంకా క్యాడర్ లో అయితే డౌట్లు ఉన్నాయట. తీరా కారు సారూ మీటింగ్స్ కి రాకపోతే ఏమి గానూ అని. ఇలా ఎందుకు అంటే ఫ్లాష్ బ్యాక్ ని వారు గుర్తు చేసుకుంటున్నారు.

ఏప్రిల్ తరువాత మళ్ళీ :

ఇక కేసీఆర్ ఈ ఏడాది ఏప్రిల్ 27న వరంగల్ లో జరిగిన పార్టీ పాతికేళ్ళ పండుగలో పాలు పంచుకున్నారు. ఆనాడు కూడా ఆవేశంగా ప్రసంగించారు. ఇక మీదట తాను జనంలోనే అని బిగ్ స్టేట్మెంట్ ఇచ్చారు. ప్రభుత్వం చేసే తప్పులను చీల్చిచెండాడుతామని కూడా చెప్పారు. కానీ తీరా చూస్తే కనుక కేసీఆర్ మళ్లీ కనిపించలేదు. ఈ మధ్యలో చాలా రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. కానీ కేసీఆర్ అయితే బయటకు వచ్చింది లేదు, మరి ఇపుడు చూస్తే రెండేళ్ళ టైం ఇచ్చామని ఇక చూస్తూ ఊరుకోమని చెబుతున్నారు. తాను జనంలో నిరంతరం ఉంటామని కూడా ఆయన అంటున్నారు. కానీ అది నిజంగా జరిగితే మాత్రం బీఆర్ఎస్ కి కొత్త కళ ఊపు జోష్ వస్తాయని క్యాడర్ అంటోంది.

ఇలా చేయండి సారూ :

ఇక కేసీఆర్ క్యాడర్ కి సమయం ఇవ్వాలని వారితో మనసు విప్పి మాట్లాడాలని అంతా కోరుకుంటున్నారు. అలాగే ఆయన పార్టీ దైనందిన కార్యక్రమాలను స్వయంగా పర్యవేక్షిస్తూ ఉంటే గులాబీ పార్టీ తిరిగి వికసించడం ఖాయమని అంటున్నారు. ఎందుకంటే ప్రతిపక్షం వైపు జనాలు ఆశగా చూస్తారు, అలాగే క్యాడర్ కూడా అధినాయకుడు మీద ఆశలు పెట్టుకుంది. అలా చేయండి సారూ అని కోరుతున్నారు. చూడాలి మరి కేసీఆర్ గట్టిగా చెప్పారు కాబట్టి ఆయన కదన రంగంలోకి దూకినట్లే అని అంటున్నారు. మరి కేసీఆర్ కనుక జనంలోకి వస్తే కనుక తెలంగాణా రాజకీయం హీటెక్కినట్లే అని అంటున్నారు.

## దేశ ప్రతిష్ఠను దెబ్బతీయడం రాహుల్‌కు అలవాటుగా మారిపోయింది



న్యూఢిల్లీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బెర్లిన్‌లో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడాన్ని భాజపా తప్పుపట్టింది. విదేశాల్లో భారత ప్రతిష‘ను దెబ్బతీసేలా వ్యవహరించడం ప్రతిపక్ష నేతకు అలవాటుగా మారిపోయిందని భాజపా ప్రతినిధి షెహజాద్ పూనావాలా మండిపడ్డారు. రాహుల్ విదేశీ పర్యటనలో లేరని భారత్‌ను అవమానించే పనిలో ఉన్నారని విమర్శించారు. భారత్‌ను విమర్శిస్తూ.. చైనాకు మద్దతివ్వడం వారికి అలవాటేనన్నారు. విదేశాల్లో భారత వ్యతిరేక శక్తులతో చేతులు కలిపి, దేశానికి వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్నారని దుయ్యబట్టారు. మరో భాజపా ప్రతినిధి శోభా కరంద్లాజే మాట్లాడుతూ.. రాహుల్ ప్రతిపక్ష నాయకుడు కాదని.. దేశ వ్యతిరేక నాయకుడని అన్నారు. ఓ పార్టీకి అగ్ర నేతగా కొనసాగుతున్నప్పటికీ చిన్నపిల్లాడిలా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు.

జర్మనీ పర్యటనలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. భారత రాజ్యాంగాన్ని రద్దు చేసే దిశగా భాజపా ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. ఈడీ, సీబీఐ, ఎన్నికల కమిషన్లను పావులుగా వాడుకొని కేంద్ర ప్రభుత్వం ఓట్ల చోరీ కి పాల్పడుతోందని ఆరోపించారు. అందువల్లే ఎన్డీఏ నేతలు ఎన్ని అక్రమాలు చేస్తున్నా దర్యాప్తు సంస్థలు తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నాయన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే ప్రతిపక్ష నేతలపై మాత్రం కేసులు పెడుతూ బెదిరింపులకు పాల్పడుతున్నాయన్నారు. వివిధ రాష్ట్రాల్లోని ఎన్నికల్లో ఓటు చోరీ జరిగినట్లు తాను ఎన్ని రుజువులు చూపిస్తున్నప్పటికీ ఎన్నికల కమిషన్ ఎటువంటి చర్యలు తీసుకోవట్లేదని విమర్శించారు. భారత్‌లో ప్రజాస్వామ్యంపై జరుగుతున్న ఈ దాడిని ఎదుర్కోవడానికి ప్రతిపక్షాలు ఓ కవచాన్ని రూపొందిస్తున్నాయన్నారు.

# వాయు కాలుష్యం ఎన్నాళ్లు?



న్యూఢిల్లీ,మనం పీల్చే ప్రాణవాయువు కొంచెం కొంచెంగా మన ప్రాణాన్ని తోడేస్తున్నదంటే నమ్మబుద్ధి కాదు. ఈ సంగతి కొన్ని దశాబ్దాలుగా తెలుస్తూనే ఉన్నా ప్రతి ఏటా దేశ రాజధాని పౌరులు చలికాలం ఉన్నన్నాళ్లూ శిక్ష అనుభవిస్తున్నారు. ఇటీవల ఏటికేడాదీ అది తప్పడం లేదు. కాకపోతే శీతకాలంలో మాత్రమే మన వ్యవస్థలన్నీ మేల్కొంటాయి. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలూ, ప్రభుత్వాల నియమ నిబంధనలూ, విపక్షాల విమర్శలూ, సామాన్యుల అరణ్య రోదనలూ... అన్నీ అప్పుడే! బీసీసీఐ సైతం దేశంలో దక్షిణాది రాష్ట్రాలు ఉన్నాయన్న సంగతే మరిచి ఇదే సీజన్‌లో ఢిల్లీలో, ఇతర ఉత్తరాది రాష్ట్రాల్లో క్రికెట్ సంబరాల నిర్వహణకు సన్నాహాలు చేస్తుంది. ఈసారి కూడా రివాజు తప్పకుండా ఇవన్నీ ఒకదాని వెంబడి మరోటి సాగుతున్నాయి. పొగమంచు కమ్మేస్తున్న పర్యవసానంగా ఢిల్లీ ప్రభుత్వం అత్యవసర చర్యలకు ఉపక్రమించింది. గురువారం నుంచి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో 50 శాతం మంది ఉద్యోగులకు 'వర్క్ ఫ్రమ్ హోమ్' మొదలైంది. ఉద్యోగులు సొంత వాహనాల్లో కాక, 'కార్ పూలింగ్' ద్వారా వచ్చేలా ప్రోత్సహించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. రాజధాని వెలుపల రిజిస్టరై, బీఎస్–4 ప్రమాణాలు లేని వాహనాల రాకపోకల్ని నిషేధించారు. కాలుష్య నియంత్రణ ధ్రువీకరణ లేని వాహనాలకు ఇంధనం విక్రయించరాదంటూ పెట్రోల్ బంకులకు ఆదేశాలు పోయాయి. 16 రోజుల పాటు అమల్లో ఉండేలా గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్(గ్రాప్)–3 విధించారు. ఈ సమయమంతా నిర్మాణ పనులు నిలిచిపోవాలి. బీఎస్–3 పెట్రోల్, బీఎస్–4 డీజిల్ వాహనాలను అనుమతించబోరు. ఇవి 12 లక్షల వరకూ ఉంటాయని లెక్కేస్తున్నారు. మొత్తంగా ఉండే కోటిన్నర వాహనాల్లో ఇవి ఏపాటి? నమోదు చేసుకున్న నిర్మాణ కార్మికులు ఆంక్షల కారణంగా పనులు కోల్పోతే రూ. 10,000 చొప్పున అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ అలా నమోదైన వారు కేవలం 2.57 లక్షలమంది మాత్రమే. ఇంతకు నాలుగైదు రెట్లు ఎక్కువగా ఢిల్లీ, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్నారని అంచనా. ఇవన్నీ మెచ్చదగ్గ చర్యలే. కానీ అసలు ఢిల్లీ సవ్యంగా ఉన్నదెప్పుడు? ఇటీవలికాలంలో అది నిరంతరం కాలుష్యంలోనే మునిగి తేలుతోంది. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ పరస్పర విరుద్ధాంశాలన్నట్టు ప్రభుత్వాలు ప్రవర్తిస్తున్నాయి. కేంద్రీకృత నగర వ్యవస్థల వల్లనే ఈ అవస్థలన్నీ దాపురిస్తున్నాయని తెలిసినా వాటిని మానుకోవడం లేదు. ఢిల్లీలో వాయునాణ్యత అతి తీవ్ర స్థాయిలో... అంటే సగటు వాయునాణ్యతా సూచిక (ఏక్యూఐ) 400కు మించి ఉన్నదని తేలింది. ఇది వరుసగా మూడు రోజులుండగా, ఆ తర్వాత అది 'దయనీయ స్థితి'(వెరీ పూర్)కి... అంటే ఏక్యూఐ 300–400 పరిధిలో కొచ్చింది. కాలుష్యం గురించి దీపావళి పండుగకు ముందో, పంజాబ్‌లో పంట కోతల సమయంలోనో గుర్తుకురావటం వల్లే ఈ సమస్యంతా! కొన్నాళ్లపాటు మొత్తంగా టపాసులు కాల్చటానికి వీల్లేదని నిషేధం విధిస్తే 'మా పండుగకే ఇలాంటివి గుర్తొస్తాయా?' అనే తర్కం తలెత్తదు. బ్యాంకుల ద్వారా వాయిదాల్లో వాహనాల కొనుగోలును కొన్నాళ్లు ఆపేస్తే ఇంత చేటు కాలుష్యం ఉండదు. అసలు ప్రజా రవాణా వ్యవస్థను పటిష్ఠం చేస్తే అత్యధికులు వాహనాల జోలికిపోరు. పరిశ్రమలు వెదజల్లుతున్న ఉద్గారాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటే కాలుష్య భూతం అదుపులో ఉంటుంది. ఇవన్నీ పట్టనట్టు నవంబర్– జనవరి మధ్య క్రికెట్ మ్యాచ్‌లకు బీసీసీఐ ఉత్తరాదిని ఎంచుకుని నగుబాటు పాలవుతోంది. లక్నోలో వాయునాణ్యత 400 మించటంతో శుక్రవారం జరగాల్సిన మ్యాచ్‌ను రద్దుచేశారు. ఇప్పుడే కాదు... 2017లో ఢిల్లీలో భారత– శ్రీలంక మ్యాచ్ సమయంలో పలుమార్లు అంతరాయం ఏర్పడింది. ఆటగాళ్లకు శ్వాసకోశ సమస్య లొచ్చాయి. కొందరైతే ఆడుతూ వాంతులు చేసుకున్నారు. 2019లో భారత–బంగ్లా మ్యాచ్ సమయంలోనూ ఇంతే! రెండేళ్ల క్రితం బంగ్లా–శ్రీలంక వరల్డ్ కప్ మ్యాచ్ చివరి నిమిషంలో రద్దయింది. కనీసం ఈ సమయంలోనైనా దక్షిణాదిని ఎంచుకుందామని బీసీసీఐకి తోచదు. ఇలా ఎవరికి తోచినట్టు వారు ప్రవర్తించకుండా ప్రభుత్వ విభాగాలన్నీ సమన్వయంతో పనిచేస్తే, ఏడాది పొడవునా అమలయ్యే చర్యలుంటే ఢిల్లీ కాస్త యినా మెరుగుపడుతుంది. కాలుష్య భూతాన్ని నియంత్రణలో ఉంచడం సాధ్యమవుతుంది.

## సోషల్ మీడియా వెట్టింగ్ పాలసీతో సంకటం

న్యూయార్క్,అమెరికా తీసుకొచ్చిన కొత్త సోషల్ మీడియా వెట్టింగ్ పాలసీ ఇప్పుడు కలకలం సృష్టిస్తోంది. ఈ కారణంగా చాలామంది దరఖాస్తుదారుల వీసా అపాయింట్‌మెంట్లు 2026 అక్టోబరు నెలాఖరుకు వాయిదా పడినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రముఖ టెక్ కంపెనీ గూగుల్ కొందరు ఉద్యోగులను హెచ్చరించింది. అమెరికాను వీడి బయటకువెళ్లొద్దని అడ్వైజరీ జారీ చేసినట్లు ఈ మేరకు ఆంగ్ల మీడియా కథనం పేర్కొంది. అమెరికాకు తిరిగి రావడానికి వీసా స్టాంపింగ్ అవసరమయ్యే ఉద్యోగులు నెలలపాటు ఎదురుచూడాల్సి వస్తుందని గూగుల్ న్యాయనిపుణులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో యూఎస్ వీసాలపై ఉన్న సిబ్బంది అంతర్జాతీయ ప్రయాణాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈమేరకు యాజమాన్యం సిబ్బందికి మెయిల్ పంపింది. డిసెంబరు 15వ తేదీ నుంచి హెచ్1బీ, హెచ్4 వీసా దరఖాస్తుదారులకు సోషల్ వెట్టింగ్‌ను అమెరికా ప్రారంభించిన సంగతి తెలిసిందే. దాంతో వీసా అపాయింట్‌మెంట్లలో జాప్యం ఎదురవుతోంది. ఎఫ్,జే,ఎం వంటి వీసాల పైనా ఈ ప్రభావం ఉంటుందని గూగుల్ నిపుణులు పేర్కొన్నారు. ఇప్పటికే అమెరికా వెలుపల ఉన్నవారి విషయంలో మాత్రం ఎలాంటి సూచనలు చేయలేదు. కాగా.. కొత్త వెట్టింగ్ విధానం వల్ల వీసా ఇంటర్వ్యూలను వచ్చే ఏడాది ఫిబ్రవరి–మార్చికి రీషెడ్యూల్ చేసినట్లు ఇటీవల అమెరికా ఎంబసీ అధికారులు వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే ఈ ప్రక్రియ మరింత ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది. వీరి ఇంటర్వ్యూ తేదీలను ఇప్పుడు అక్టోబరు నెలకు వాయిదా వేసినట్టు మీడియా కథనాలు పేర్కొన్నాయి. వీసా దరఖాస్తుదారుల సోషల్ మీడియా ఖాతాలను క్షుణ్ణంగా స్క్రీనింగ్ చేసేందుకు అదనపు సమయం పడుతోందని, అందువల్లే ఇంటర్వ్యూలను వాయిదా వేస్తున్నట్లు అమెరికా అధికారులు చెబుతున్నారు. దీంతో దరఖాస్తుదారుల పరిస్థితి గందరగోళంలో పడింది. ఇప్పటికే అమెరికాలో ఉద్యోగాలు సాధించి.. ప్రయాణాల కోసం టికెట్లు బుక్ చేసుకున్నవారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో గూగుల్ అడ్వైజరీ దీనిని సమర్థించేలా ఉంది. దీంతో వచ్చే ఏడాది వరకు ఉద్యోగులకు కష్టాలు తప్పేలా లేవు.

## ఒడిషా ఘటనపై సోషల్ మీడియాలో వైరల్

భువనేశ్వర్, ప్రభుత్వ ఉద్యోగం కోసం వేలాది మంది అభ్యర్థులు ఎయిర్‌పోర్ట్ రన్‌వేపై నేలపై కూర్చుని పరీక్ష రాశారు. రన్‌వేపై పరీక్ష అని ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. ఇటీవల ఒడిశాలో జరిగిన ఈ ఘటన సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. హోంగార్డు ఉద్యోగం కోసం అభ్యర్థులకు పరీక్ష రాసేందుకు ఒడిశా ప్రభుత్వం సంబల్‌పూర్ జిల్లాలోని జమదాపాలి రన్‌వేను కేటాయించారు. డెస్కులు, మ్యాట్‌లు వంటి కనీస సౌకర్యాలు లేకుండా 8,000మందికి పైగా అభ్యర్థులు రన్‌వేపై కూర్చుని పరీక్ష రాశారు. అభ్యర్థులను పర్యవేక్షించేందుకు డ్రోన్‌లను వినియోగించడం గమనార్హం. వివరాల ప్రకారం.. సబల్‌పూర్ జిల్లాలోని 24 పోలీస్‌స్టేషన్లలో హోంగార్డు పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ పోస్టులకు కనీస అర్హత 5వ తరగతి ఉత్తీర్ణత. కేవలం 187 పోస్టుల కోసం జిల్లా వ్యాప్తంగా 8,000మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో ఎంబీఏ, ఎంసీఏ, గ్రాడ్యుయేట్లు, ఇంజనీర్లు, డిప్లొమా, ఐటీఐ శిక్షణ పొందిన అభ్యర్థులతో పాటు కంప్యూటర్ సైన్స్‌లో డిగ్రీ పొందిన వారు కూడా ఉన్నారు. అభ్యర్థులను ఉదయం 6.00గంటలకు రిపోర్ట్ చేయాలని అధికారులు ఆదేశించారు. అయితే ఉదయం 9.00 గంటలకు పరీక్షా కేంద్రంలోకి అనుమతించబడ్డారు. ఉదయం 10.30గంటలకు ప్రశ్నాపత్రాలను పంపిణీ చేయబడ్డాయి. 50మార్కుల ప్రశ్నాపత్రంలో 20 మార్కులకు పేరా రైటింగ్, 30 మార్కులకు జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు ఉన్నాయి. ముగ్గురు అదనపు సూపరింటెండెంట్లు, 24మంది ఇన్స్పెక్టర్లు, 86మంది సబ్‌ఇన్స్పెక్టర్లు, అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్లతో పాటు వందమందికి పైగా హోమ్ గార్డులు, ట్రాఫిక్ సిబ్బందిని అభ్యర్థులను పర్యవేక్షించారు. ఈ ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిరుద్యోగ సమస్యకు ఈ ఘటన నిదర్శనమని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఉపాధి కల్పనలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యమైందని మండిపడ్డాయి.

## ఎమ్మెల్యేలు సరిగా పనిచేయలేదా?

నల్లగొండ, పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ బాగా దెబ్బతిన్న జిల్లాల్లో నల్లగొండ కూడా ఉంది. ఇక్కడి ఎమ్మెల్యేల÷-లో అనైక్యత ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపింది. ఎవరికి వారే అన్న చందంగా సాగడంతో ఈ జిల్లాల్లో అనేక గ్రామాలను కాంగ్రెస్ కోల్పోయింది. ఇద్దరు మంత్రులు ఉన్నా పట్టుదలగా పనిచేసినట్లుగా కనిపించలేదు. ఇదే విషయంపై పిసిసి భేటీలో చర్చించారు. రెబల్‌గా ఉంటున్న రాజగోపాల్ రెడ్డి కూడా సరిగా పనిచేయలేకపోయారు. ఆయన మంత్రిపదవిపై ఆశపెట్టుకుని రాకపోయేసరికి సైలెంట్ అయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కొరకరాని కొయ్యగా మారుతున్నారని పార్టీలో ప్రచారం ఉంది. మంత్రివర్గంలోకి తీసుకోవాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆదేశించినా తీసుకోలేదని ఆయన సన్నిహితులు వాపోతున్నారు. ఆయనకు మంత్రి పదవి హామీ ఇచ్చారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలప్పుడు పార్టీ గెలుపుకు సహకరించారు' అని రాహుల్ గుర్తుచేసినట్లు సమాచారం. సామాజిక సమీకరణాలు సమీక్షించి, వీలైనంత త్వరలో రాజగోపాల్‌రెడ్డిని మంత్రివర్గంలోకి తీసుకోవాలని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌కు రాహుల్ సూచించినట్టు తెలిసింది. రెండో పర్యాయం జరిగిన మంత్రివర్గ విస్తరణలో తనకు బెర్తు ఖాయమని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి భావించారు. ఆ మేరకు కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి సంకేతాలు అందుతంతో ఆయన సన్నిహితులు ఫ్లెక్సీలు, దండలు, బ్యాండ్‌బాజాలు సిద్ధం చేసుకున్నారు. కానీ అదే సమయంలో ఆ పార్టీ సీనియర్ నేత జానారెడ్డి అడ్డు తగులుతూ.. రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలకు మంత్రి పదవి ఇవ్వాలంటూ కాంగ్రెస్ అధిష్ఠానానికి లేఖ రాశారు. తనకు మంత్రి పదవి రాకుండా అడ్డుకునే కుట్రలో భాగంగానే రేవంత్‌రెడ్డి ఈ లేఖ రాయించారని రాజగోపాల్‌రెడ్డి అనేక సందర్భాల్లో తన సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తంచేసినట్లు తెలిసింది. ఇక అప్పటినుంచి ఆయన నేరుగా సీఎం రేవంత్‌రెడ్డికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పదునైన విమర్శలు చేయడం ప్రారంభించారు. ఈ క్రమంలో మొన్నటి సర్పంచ్ ఎన్నికల్లో పెద్దగా పనిచేయలేదన్న ప్రచారం కూడా ఉంది. సీఎం రేవంత్‌రెడ్డిపై రాజగోపాల్‌రెడ్డి నిరంతరం విమర్శలు సంధిస్తున్న నేపథ్యంలో సీఎం సన్నిహితవర్గం రంగంలోకి దిగింది. రాజగోపాల్‌పై భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. రాజగోపాల్‌రెడ్డి సీఎంకు వ్యతిరేకంగా మాట్లాడిన ఆడియోలు, వీడియో క్లిప్పింగులు, పత్రికా వార్తలను సేకరించి ఏఐసీసీకి పంపినట్లు సమాచారం. తమకు అనుకూలంగా ఉన్న ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ద్వారా రాజగోపాల్‌రెడ్డి మీద క్రమశిక్షణ చర్యలకు ఒత్తిడి చేయించినట్టు తెలిసింది.

## గాడ్సే ఆరాధకుల కోసమే 'గాంధీ' పేరు తొలగింపు

న్యూఢిల్లీ,మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్ ఆర్ఇజిఎ)నుండి మహాత్మా గాంధీ పేరు తొలగించాలనే ప్రయత్నం, బిజెపి, నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వానికి ఉన్న ప్రజావిరోధి, క్రూరమైన ఉద్దేశాలను స్పష్టంగా బయటపెడుతోంది. ఎం.జి. నరేగా ద్వారా ఇప్పటివరకు 15.5 కోట్ల మంది క్రియాశీల గ్రామీణ కార్మికులకు ఉపాధి లభించింది. వీరిలో దాదాపు 50% మహిళలు. లబ్ధిదారుల్లో అధిక శాతం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, పీడిత వర్గాలకు చెందినవారే. గ్రామస్వరాజ్యం –ప్రతి గ్రామం స్వయం సమృద్ధిగా ఉండాలన్నది గాంధీజీ కల. ఆ కలను రూపం లోకి తీసుకువచ్చిన చట్టమే ఎం.జి. నరేగా. కానీ 2014లో అధికారంలోకి వచ్చినప్పటినుంచి ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం, ఈ చట్టాన్ని బలహీనపరచడం, క్రమంగా నిర్వీర్యం చేయడం అనే దిశలోనే పని చేస్తోంది. పేదల కోసం అన్నట్లు మాట్లాడే మోడీ ప్రభుత్వం వాస్తవంగా వందమంది కార్పొరేట్ కుటుంబాల అభివృద్ధికే కట్టుబడి ఉంది. నరేగా పై కొనసాగుతున్న దుష్ప్రచారం మొత్తం గోబెల్స్ తరహా అసత్య ప్రచారమే. మహాత్మా గాంధీ పేరు తొలగించడం యాదృచ్ఛిక చర్య కాదు. ఇది గాంధీ హంతకుడు గాడ్సేను ఆరాధించే కాషాయ శక్తులను సంతృప్తి పరచడానికే తీసుకున్న రాజకీయ నిర్ణయం. నరేగా స్థానంలో మరో కొత్త చట్టం తీసుకురావాలన్న ప్రయత్నం కూడా ఇదే అజెండాలో భాగం. కొత్త చట్టంలో: 'సంవత్సరానికి 100 రోజులు నుంచి 150 రోజులు ఉపాధి కల్పిస్తామని చెబుతున్నారు ఇది కేవలం మోసం. 'ఖర్చులో 60 శాతం రాష్ట్ర ప్రభుత్వాలే భరించాలి అని ప్రతిపాదిస్తున్నారు. దీని వల్ల 'ఆర్థికంగా బలహీనమైన రాష్ట్రాలు ఈ భారాన్ని మోయలేకపోతాయి. 'చివరకు ఉపాధి హామీ పథకం ప్రయోజన రహితంగా కూలిపోతుంది. ఇంకా, గ్రామ పంచాయతీలకు పనుల ఎంపికలో అధికారం లేదు. కేంద్ర ప్రభుత్వమే ఏ పని చేయాలో ఆదేశిస్తుంది. పెరుగుతున్న ధరల మధ్య వేతన పెంపుపై ఒక్క మాట లేదు. ఇది 15.5 కోట్ల గ్రామీణ పేదలపట్ల ఎన్‌డిఎ ప్రభుత్వానికి ఉన్న అమానుష వైఖరిని స్పష్టంగా చూపిస్తుంది. ఇప్పటివరకు నరేగా పథకానికి ప్రభుత్వం ఖర్చు చేసిన మొత్తం సుమారు రూ. 10 లక్షల కోట్లు. దీని ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆకలి మరణాలు, ఉపాధి లేని వారి ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయి. కానీ అదే సమయం లో 2021 –22 వరకు కార్పొరేట్లకు రూ. 8 లక్షల కోట్లు పన్ను రాయితీలు, 2022 –2024 మధ్య మరో రూ. 3 లక్షల కోట్లు, మొత్తం పన్ను రాయితీలు రూ. 11 లక్షల కోట్లు కార్పొరేట్ రుణ మాఫీలు రూ. 16.5 లక్షల కోట్లు. అంటే మొత్తం మీద 100 మంది కార్పొరేట్ మిత్రులకు రూ. 28 లక్షల కోట్లు, 15.5 కోట్ల పేదలకు కేవలం రూ. 10 లక్షల కోట్లు, ఇదే బిజెపి ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల పేదల వ్యతిరేక విధానం. వ్యవసాయ సంక్షోభం–గ్రామీణ విపత్తు, స్వాతంత్ర్యం వచ్చి 8దశాబ్దాలు గడిచినా పేదరికం, ఆకలి,



నిరుద్యోగం ఇవన్నీ దేశాన్ని వెంటాడుతూనే ఉన్నాయి. మోడీ ప్రభుత్వం ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ అంటూ గొప్పలు చెప్పుకుంటోంది. కానీ వాస్తవం ఏమిటంటే: గ్రామాలనుంచి పట్టణాలకు వలసలు పెరుగుతున్నాయి. వ్యవసాయం నష్టాల వృత్తిగా మారింది. కనీస మద్దతు ధరలేదు. రైతులు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఉదాహరణలు: కర్నూలు జిల్లాలో టమాటా రైతులు రోడ్లపై పంట పారేస్తున్నారు. వరంగల్ జిల్లాలో పత్తి రైతులు నష్టాల్లో ఉన్నారు. తెలంగాణ, రాయలసీమ, ఉత్తరాంధ్రలో కరువు ఛాయలు. తీరాంధ్రలో వరదలు, భారీ వర్షాలతో నానిపోయిన ధాన్యం. యుపిఎ 1 ప్రభుత్వ కాలంలో, వామపక్ష పార్టీలే గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రతిపాదించాయి. గ్రామీణ నిరుద్యోగుల ఆత్మహత్యలకు చెక్ పెట్టే విప్లవాత్మక ఆలోచన ఇది. అప్పటి ఆర్థిక మంత్రి పి. చిదంబరం తీవ్రంగా వ్యతిరేకించినా, వామపక్షాల ఒత్తిడితో 2006లో చట్టంగా మారింది. గాంధీజీ కలకు ప్రతీకగా దీనికి మహాత్మా గాంధీ పేరు పెట్టారు. ఉపాధి హామీ దానం కాదు నరేగా డబ్బుల వృథా అన్న ప్రచారం పూర్తిగా అసత్యం. ఇది పని చేయడానికి హక్కు కల్పించే చట్టం. సోవియట్ యూనియన్‌లో లెనిన్ ప్రవేశపెట్టిన 'సబ్‌బోట్నిక్స్' ద్వారా ప్రతి పౌరుడిలో శ్రమ విలువను పెంచారు. ఆ స్ఫూర్తితోనే నేను కూడా నా స్వగ్రామం ఐనంబాకంలో నరేగా పనుల్లో 8 గం. పని చేశాను, కార్మికులతో కలిసి అక్కడే భోజనం చేశాను. అవును, అమలులో లోపాలు ఉన్నాయి. కొంతమంది భూస్వాములు, రాజకీయ నాయకులు అవినీతికి పాల్పడుతున్నా రు. అలాంటి వారిని అరెస్ట్ చేసి, ఆస్తులు స్వాధీనంచేసుకోవాలి. కానీ అవినీతిపేరుతో చట్టాన్ని చంపడం నేరం. 15 రోజుల్లో వేతనం, సమాన పనికి సమాన వేతనం, వలసలు, ఆత్మహత్యలకు అడ్డుకట్ట. కార్పొరేట్లకు రూ. 28 లక్షల కోట్లు ఇచ్చే ప్రభుత్వం, 15.5 కోట్లపేదల జీవనాధారమైన నరేగాను ఎందుకు రక్షించలేకపోతోంది? మహాత్మాగాంధీ పేరు తొలగించడం పరిపాలనా సంస్కరణ కాదు–అది భావజాల విధ్వంసం. ఈ ప్రగతిశీల చట్టాన్ని కాపాడటం ప్రతి ప్రజాస్వామ్య శక్తి బాధ్యత.

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం

మంచిర్యాల/ఖమ్మం, రోడ్డు ప్రమాదాలు రోజు రోజుకు పెరిగిపోతూనే ఉన్నాయి. అధిక వేగం, నిర్లక్ష్యమైన డ్రైవింగ్ కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగి అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన వారు తిరిగి వచ్చే వరకు నమ్మకం లేకుండాపోతున్న పరిస్థితి. అసలు ప్రమాదం ఎక్కడి నుంచి వస్తుందో తెలియడం లేదు. పెద్ద ప్రమాదాలు జరిగి ప్రాణాలతో బయటపడి మృత్యుంజయులుగా ఉన్న వారు ఎందరో ఉండగా.. చిన్న ప్రమాదాలకు ప్రాణాలు కోల్పోయిన వారు ఉన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టినా కూడా ఎక్కడో చోట ప్రమాదాలు జరిగి అనేక మంది మరణిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం మంచిర్యాల, ఖమ్మంలలో జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృత్యువాత పడ్డారు. తాజాగా మంచిర్యాలలో జరిగిన రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. జిల్లాలోని ఇందారం క్రాస్ రోడ్డు వద్ద సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న బొలెరోను వేగంగా దూసుకొచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. వరి నాట్లు వేసేందుకు మహారాష్ట్ర నుంచి కరీంనగర్ జిల్లాకు 23 మంది కూలీలు బొలెరోలు వెళు తున్నారు. ఈ క్రమంలో ఇందారం క్రాస్ వద్ద బొలెరో వాహనం కొద్దిసేపు ఆగింది. ఇంతలో అనుకోని ప్రమాదం వారిని వెంటాడింది. ఓ లారీ అతి వేగంగా దూసుకొచ్చి బొలెరోను ఢీకొట్టింది. దీంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని క్షతగాత్రులను జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన వారిని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఖమ్మం రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన ఘటన సోమవారం ఎదులాపురం మున్సిపాలిటీలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాయిడుపేట బైపాస్ రోడ్డు నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న పాముల కేశవులు అనే ద్విచక్ర వాహనదారుడిని ఖమ్మం నుంచి నాయుడు పేట వైపుగా వస్తున్న ఆర్టీసి బస్సు ఢీ కొట్టింది. దింతో తీవ్ర గాయాలపాలైన కేశవులు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఖమ్మం రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ వైద్యాశాల మార్చురికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### తిరుమల శ్రీవారి సేవలో ఇస్రో చైర్మన్ నారాయణన్

తిరుమల,ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) చైర్మన్ డా. వి. నారాయణన్ సోమవారం తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. మేజర్ మిషన్లకు ముందు ఇస్రో అధికారులు తిరుమల దర్శనం చేసుకోవడం సంప్రదాయం. ఈసారి డిసెంబర్ 24న జరగబోయే ముఖ్యమైన లాంచ్‌కు శ్రీవారి ఆశీస్సులు కోరుకున్నట్టు తెలుస్తోంది.

## ఉక్రెయిన్ డ్రోన్ దాడిలో దెబ్బతిన్న రెండు నౌకలు

మాస్కో,ఉక్రెయిన్ డ్రోన్ దాడిలో రెండు నౌకలు దెబ్బతిన్నట్లు రష్యా అధికారులు సోమవారం తెలిపారు. డ్రోన్ దాడిలో రెండు పిల్లర్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, నౌకల్లో మంటలు చెలరేగాయని అన్నారు. రష్యాలోని క్రాస్నోడార్ ప్రాంతంలోని నల్లసముద్ర తీరంలో ఉన్న వోల్నా గ్రామంపై ఉక్రెయిన్ డ్రోన్‌లతో విరుచుకుపడిందని క్రాస్నోడార్ ప్రాంతానికి చెందిన కార్యనిర్వాహక ప్రధాన కార్యాలయం టెలిగ్రామ్‌యాప్‌లో పేర్కొంది. నల్లసముద్రంలోని వోల్నా టెర్మినల్ వద్ద ఉన్న నౌకల్లోని సిబ్బందిని సురక్షితంగా ఖాళీ చేయించామని తెలిపింది. డ్రోన్ దాడితో 1,500 చదరపు మీటర్ల వరకు మంటలు వ్యాపించాయని, స్థానిక కాలమానం 2.00 గంటలకు కూడా మంటలు అదుపులోకి రాలేదని అధికారులు తెలిపారు. ఉక్రెయిన్ తరచుగా క్రాస్నోడార్ ప్రాంతంపై విరుచుకుపడుతోందని రష్యా ఆర్మీ తెలిపింది. శుద్ధి కర్మాగారాలు, ఇంధన గిడ్డంగులు, ఓడరేవులు మరియు వైమానిక స్థావరాలను లక్ష్యంగా డ్రోన్లతో దాడి చేస్తోందని పేర్కొంది. నల్లసముద్ర ప్రాంతం రష్యా ఇంధన ఎగుమతులు మరియు సైనిక వ్యూహాలకు ముఖ్యమైన కేంద్రంగా ఉంది. క్రిమియా సరిహద్దులో, దక్షిణ ఉక్రెయిన్‌లోని డ్రోన్ పరిధిలో ఉంది. నల్లసముద్ర ప్రాంతంలోని వోల్నా గ్రామం రష్యాకు కీలకం. ఇది 2014లో ఉక్రెయిన్ నుండి విలీనం చేయబడిన క్రిమియన్ ద్వీపకల్పానికి ప్రధాన భూభాగాన్ని అనుసంధానిస్తుండటంతో పాటు కెర్చ్ జలసంధిపై ఉన్న క్రిమియన్ వంతెనకు దగ్గరగా కూడా ఉంటుంది.

## అసోం రాజధాని గౌహతిలో శ్రీవారి ఆలయం

తిరుమల,కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామివారి వైభవాన్ని ఈశాన్య భారతదేశంలో మరింత విస్తరించే దిశగా కీలక ముందడుగు పడింది. గువాహటి నగరంలో శ్రీ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రం నిర్మాణం సాకారం కానుంది. అసోంలో అద్భుత దేవాలయ నిర్మాణానికి అక్కడి ప్రభుత్వం సహకారం అందించనుంది. ఆలయ నిర్మాణానికి తొలుత నిర్ణయించిన 10.8 ఎకరాల భూమికి బదులుగా 25 ఎకరాల భూమిని కేటాయించేందుకు అస్సాం ప్రభుత్వం నిర్ణయించింది. అస్సాం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య జరిగిన సంప్రదింపుల అనంతరం ఈ కీలక నిర్ణయం వెలువడింది. గువాహటి సమీపంలోని కామ్రూప్ మెట్రోపాలిటన్ జిల్లాలో 10.8 ఎకరాల భూమిని కేటాయించేందుకు అస్సాం ప్రభుత్వం గతంలోనే అంగీకారం తెలిపింది. అయితే డిసెంబర్ 7న అస్సాం ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి కేకే ద్వివేది టీటీడీ ఛైర్మన్‌కు లేఖ రాస్తూ గువాహటిలోని గర్చుక్ ప్రాంతంలో ఇప్పటికే ఉన్న శ్రీవారి ఆలయం మరియు సాంస్కృతిక సముదాయం నిర్వాహకుల సూచనలను ఛైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. కామ్రూప్ మెట్రోపాలిటన్ జిల్లాలో టీటీడీ శ్రీ వేంకటేశ్వర ఆలయం నిర్మిస్తే, అక్కడ ఉన్న ఆలయ ప్రయోజనాలకు భంగం కలగవచ్చని వారు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో శ్రీ వేంకటేశ్వర ఆలయాన్ని అస్సాంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న సిల్చార్ లేదా డిబ్రూగఢ్ నగరాల్లో ఏర్పాటు చేయాలని అస్సాం సీఎం అదనపు ప్రధాన కార్యదర్శి సూచించారు. ఈ విషయాన్ని టీటీడీ చైర్మన్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన ఈనెల 18న అస్సాం ముఖ్యమంత్రి డాక్టర్ హిమంత బిశ్వ శర్మకు లేఖ రాశారు. దేశంలోని ప్రతి రాష్ట్రం మరియు కేంద్రపాలిత ప్రాంతంలో కనీసం ఒక శ్రీ వేంకటేశ్వర ఆలయాన్ని స్థాపించడం ద్వారా హిందూ సనాతన ధర్మం, శ్రీ వేంకటేశ్వర స్వామివారి మహిమను విస్తరించాలన్నది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు టీటీడీ నిబద్ధతగా ఆ లేఖలో పేర్కొన్నారు. ఆంధప్రదేశ్ కొత్త రాజధాని అమరావతిలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 25 ఎకరాల భూమిని కేటాయించిన విషయాన్ని అస్సాం ముఖ్యమంత్రికి గుర్తు చేస్తూ, సిల్చార్ లేదా డిబ్రూగఢ్ బదులుగా అస్సాం రాజధాని గువాహటిలోనే టీటీడీకి 25 ఎకరాల భూమి కేటాయించాలని సీఎం చంద్రబాబు కోరారు. ఈశాన్య భారతదేశానికి గువాహటి ప్రధాన కేంద్రంగా ఉన్నందున, భక్తుల సౌకర్యాలు, నిత్య అన్నదానం వంటి ధార్మిక కార్యక్రమాలతో కూడిన దివ్యక్షేత్రాన్ని ఏర్పాటు చేయడానికి సుమారు 25 ఎకరాల భూమిని కేటాయించాలని సిఫార్సు చేశారు. అలాగే ప్రతిపాదిత స్థలంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అస్సాం ప్రభుత్వం ఆర్థిక సహకారం కూడా అందించాలని ఏపీ సీఎం తన లేఖలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చేసిన సూచనలకు సానుకూలంగా స్పందించిన అస్సాం ముఖ్యమంత్రి గువాహటిలోనే టీటీడీకి 25 ఎకరాల భూమిని కేటాయించేందుకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపారు. అలాగే ప్రతిపాదిత ప్రాజెక్టు అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని కూడా అందించేందుకు అంగీకరించారు. ఈ అంశాన్ని సౌహార్దపూర్వకంగా పరిష్కరించినందుకు ఆంధ్రప్రదేశ్ , అస్సాం రాష్ట్రాల ముఖ్యమంత్రులకు టీటీడీ చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు. భూమి కేటాయింపునకు సంబంధించిన విధివిధానాలను పూర్తి చేసి, ఈశాన్య భారతదేశంలో తొలి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభించేందుకు అస్సాం ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటామని తెలియజేశారు.

## రేవంత్ కూల్ పాలిటిక్స్ ...

హైదరాబాద్,రాజకీయాలు అంటే మైండ్ గేమ్. ఎవరు ఎక్కువగా మైండ్ గేమ్ ఆడతారో వారిదే ఎక్కువగా పైచేయి అవుతుంది. ఈ మైండ్ గేమ్ ను అర్థం చేసుకోలేక ఫ్రస్టేషన్ కు గురైతే మొదటికే మోసం వస్తుంది. ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో అదే జరుగుతోంది. విజయాలతో కూల్ గా ఉన్న రేవంత్.. మైండ్ గేమ్ గట్టిగా ఆడుతున్నారు. దీన్ని కేటీఆర్, హరీష్ రావు తట్టుకోలేకపోతున్నారు. ఫ్రస్టేషన్‌కు గురవుతున్నారు. ఈ పరిస్థితిని కాంగ్రెస్ మరింత అనుకూలంగా మల్చుకుంటోంది.

**బీఆర్ఎస్‌లో మరిన్ని సమస్యలు సృష్టించేలా రేవంత్ వ్యాఖ్యలు**

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పంచాయతీ ఎన్నికల ఫలితాలపై స్పందించడానికి ప్రెస్మీట్ పెట్టారు. మెజార్టీ సీట్లు సాధించారు కాబట్టి ఆయన చాలా కూల్ గా మాట్లాడారు. రాజకీయంగా బీఆర్ఎస్ పై ఎలాంటి విమర్శలు చేయాలో అలాంటివి చేశారు. కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా బాధ్యతలు చేపట్టిన తర్వాత బీఆర్ఎస్ ఒక్క ఎన్నికలోనూ గెలవలేదని అన్నారు. అదే సమయంలో హరీష్ రావు పార్టీ నాయకత్వాన్ని చేజిక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్నట్లుగా వ్యాఖ్యలు చేశారు. వెంటనే హరీష్ రావు కంగారుగా స్పందించారు. కేటీఆర్‌కు తనకు మధ్య మిత్రభేదం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఎప్పటికీ తన గుండెల్లో కేసీఆర్, గులాబీ జెండా ఉంటాయని వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఇప్పటికే కవిత హరీష్ రావును టార్గెట్ చేస్తున్నారు. హరీష్ పై సోషల్ మీడియాలో రకరకాల ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో హరీష్ ఒత్తిడికి గురవుతున్నారు.

**ఫ్రస్టేషన్ కు గురై వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్న కేటీఆర్**

పంచాయతీ ఎన్నికల ఫలితాలు తమకు అనుకూలంగా వచ్చాయని చెప్పుకుంటున్న బీఆర్ఎస్‌లో ఏ మూల కూడా ఆ జోష్ కనిపించడం లేదు.

# జనవరి13 నుంచి కైట్ ఫెస్టివల్



హైదరాబాద్,సంక్రాంతి పండుగను పురస్కరించుకుని హైదరాబాద్ నగరంలో వచ్చే నెల 13వ తేదీ నుంచి కైట్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. దీని ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సంక్రాంతి పండుగ వాతావరణానికి తగిన విధంగా హైదరాబాద్ నగరపు సాంస్కృతిక వైభవం ప్రతిబింబించేలా కైట్ ఫెస్టివల్ ను ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఈ కైట్ ఫెస్టివల్ కు ప్రత్యేక గుర్తింపు, విస్తృత ప్రచారం కల్పించేలా సరైన పేరు, ప్రత్యేక బ్రాండింగ్, ఆకర్షణీయమైన లోగోను రూపొందించాలని సంబంధిత శాఖలను ఆయన ఆదేశించారు. హైడ్రా ద్వారా పునరుజ్జీవింపబడిన చెరువుల వద్ద ఈ కైట్ ఫెస్టివల్ ను నిర్వహించాలని గౌరవ ముఖ్యమంత్రి ఆకాంక్షను సిఎస్ తెలిపారు. దీని ద్వారా నగరంలోని నీటి వనరుల పునరుద్ధరణ లో సాధించిన విజయాలను ప్రజలకు తెలియజేయడం లక్ష్యమని ఆయన అన్నారు. గుర్తించిన ప్రదేశాల్లో కైట్ ఫెస్టివల్ కు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించి సమన్వయం చేయడానికి జిహెచ్ఎంసి హెచ్ఎండిఏ, హైడ్రా తరఫున ఒక్కొక్క ప్రత్యేక అధికారిని నియమించాలని ఆయన ఆదేశించారు. జనవరి మొదటి వారం నుంచి మంత్రులు పునరుద్ధరించబడిన చెరువులను స ందర్శించి ఏర్పాట్లను సమీక్షిస్తారని ఆయన తెలిపారు.మావేశంలో హైడ్రా కమి షనర్ ఏ.వి. రంగనాథ్ నగరవ్యాప్తంగా హైడ్రా ద్వారా పునరుజ్జీవింపబడిన చె రువులపై సమగ్ర ప్రెజెంటేషన్ ఇచ్చారు. నీటి నిల్వ సామర్థ్యం పెంపు, పర్యావర ణ స్థిరత్వం,ప్రజాప్రయోజనాల కోసం చేపట్టిన పునరుద్ధరణ పనులను వివరించారు.

# కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు

పెద్దపల్లి, కమిషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి రూ. లక్షల కోట్లు అప్పులు చేసిన వారు ఇప్పుడు మళ్లీ రంకెలు వేస్తున్నారని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ డిజైన్ చేసి.. నిర్మించిన కాళేశ్వరం వారి హయాంలోనే కూలిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. మేడిగడ్డ ప్రాజెక్టు గురించి మాట్లాడటం ఆపి.. సిగ్గుతో తలదించుకోవాలని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో ఐదేళ్లలో వాడుకున్న నీరు 70, 80 టీఎంసీలే. రూ.1.80 లక్షల కోట్ల ప్రాజెక్టు నిరుపయోగం కావడం బీఆర్ఎస్ ఘనత. ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీలు అనేది పదేళ్లకు అంగీకరించారు. పాలమూరు, ఎస్ఎల్‌బీసీని బీఆర్ఎస్ పూర్తి చేస్తుంటే ఎవరైనా అడ్డుకున్నారా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీల కింద ఏటా రూ.16వేల కోట్లు చెల్లిస్తున్నాం. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు పూర్తిగా రాలేదు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన రూ.5 వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టారు. ప్రాజెక్టు పూర్తి చేయకుండానే పాలమూరు ప్రజలకు అన్యాయం చేశారని ఉత్తమ్ విమర్శించారు. ఈ మేరకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వంపై అనవసరంగా విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కేసీఆర్ చెప్పేవన్నీ అసత్యాలేనని విమర్శించారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ. 27 వేల కోట్లు ఖర్చు పెట్టారని.. అయిన 90 శాతం పనులు కూడా ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం రూ.5 వేల కోట్లు పెండింగ్ బిల్లులు పెట్టిందని ఆరోపించారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు ఎన్విరాన్‌మెంట్ క్లియరేన్స్ రాలేదని చెప్పుకొచ్చారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేయకుండా మహబూబ్‌నగర్ ప్రజలను బీఆర్ఎస్ మోసం చేసిందని ధ్వజమెత్తారు సోమవారంపెద్దపల్లి జిల్లాలో మంత్రి ఉత్తమ్ పర్యటించారు. ఈ సందర్భంగా గుంపుల, అడవి సోమనపల్లి గ్రామాల్లో కూలిపోయిన చెక్ డ్యాంలను పరిశీలించారు. ఈ ఘటనపై అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంపుల, అడవి సోమనిపల్లి గ్రామాల్లో కూలిపోయిన చెక్ డ్యాంలపై విజిలెన్స్ విచారణకు ఆదేశించామని తెలిపారు. ఈ పనులను నాసిరకంగా, నాణ్యతలేమితో



నిర్మించినా లేదా ఎవరైనా కావాలనే ధ్వంసం చేసినట్లు తేలినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయాన్ని తమ ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని అన్నారు. ఈ విచారణను వేగవంతం చేసి బాధ్యులను గుర్తించాలని ఇప్పటికే విజిలెన్స్ అధికారులను ఆదేశించామని అన్నారు. రైతన్నలకు మేలు చేసే చెక్ డ్యాంలను ఎవరైనా కావాలని ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తే ఊపేక్షించబోమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. 'నీటి వాటాలో 71 శాతం మాకు 29శాతం ఏపీకి ఇవ్వాలని మేము పోరాడుతున్నాం. 17 జనవరి 2024, ఫిబ్రవరిలో కేఆర్ఎంబీకి లేఖ ఇచ్చాం. ఇరిగేషన్ కాంట్రాక్టర్ల లిస్ట్ తీయండి. కేసీఆర్ హయంలో లాగా ఏపీ కాంట్రాక్టర్లకు మేము ఇచ్చామా..? హరీశ్‌రావు పేరు మార్చుకుని గోబెల్స్ అని పెట్టుకోవాలి. కాళేశ్వరం విషయంలో పదే పదే అసత్యాలు మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్ నాయకులు సిగ్గుతో తలవంచుకోవాలి. తెలంగాణ ప్రజల తలను తాకట్టు పెట్టి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారు. కేసీఆర్ కట్టిన కాళేశ్వరం కూలిపోయింది. రాష్ట్రంలో ఇప్పుడున్న ప్రాజెక్టులను కట్టింది కాంగ్రెస్. కాళేశ్వరం నుంచి గత ఐదేళ్లలో 70 టీఎంసీల నీళ్లను మాత్రమే ఉపయోగించారు. హరీశ్‌రావు అతి తెలివితేటలు వాడటం ప్రజలు గమనిస్తున్నారు. కృష్ణా జలాల విషయంలో 2014 నుంచి 2020 వరకు జరిగిన అపెక్స్ కౌన్సిల్ భేటీల్లో కేసీఆర్ సంతకాలు పెట్టారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రస్తావించారు.

# రాయలసీమను రతనాల సీమ చేస్తానని అనలేదా?

హైదరాబాద్,బీఆర్ఎస్ బలహీనమైందని కేసీఆర్‌కు అర్థమైందని.. పార్టీని కాపాడుకోవడానికే మాజీ సీఎం బయటకు వచ్చారని మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యాఖ్యలు చేశారు. కెటిఆర్‌తో లాభం లేదని తెలుసుకున్నాడని ఎద్దేవా చేశారు. సోమవారం నాడు మాట్లాడుతూ... కొడుకు, అల్లుడు వల్ల పార్టీ దిగజారుతోందని కేసీఆర్ భావించారని తెలిపారు. పాలమూరు ప్రాజెక్టులను కాంగ్రెస్ పట్టించుకోవడం లేదనేది అబద్ధమన్నారు. కేసీఆర్ ముందు చేసే పని వెనక, వెనక చేసే పని ముందు చేశారని విమర్శించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ఇరిగేషన్ కోసం కాదు తాగునీటి కోసమే అని.. సుప్రీం కోర్టులో కేసీఆర్ ప్రభుత్వం చెప్పిందని గుర్తుచేశారు. పదేళ్ల పాటు ఈ ప్రాజెక్టును పక్కన పెట్టారని, దీనికి సమాధానం చెప్పాలన్నారు. కేసీఆర్ నీళ్ల విషయంలో అనేక తప్పిదాలు చేశారని మండిపడ్డారు. తెలంగాణ నీటి హక్కులను వాడుకోవడంలో కేసీఆర్ విఫలమయ్యారన్నారు. బీజేపీ ప్రతి అడుగులో బీఆర్ఎస్ తోడుగా ఉందని ఆరోపించారు. జగన్ దగ్గరకు వెళ్ళి రాయలసీమను రతనాల సీమగా చేస్తానని కేసీఆర్ అన్నారని.. నీటి హక్కులను సాధించకపోవడంలో వైఫల్యం కేసీఆర్ దే అని వ్యాఖ్యలు చేశారు. పాలమూరు ప్రాజెక్టులపై ప్రేమ ఉన్నట్టు కేసీఆర్ నటిస్తున్నారని మంత్రి విమర్శలు గుప్పించారు.యూరియాపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి స్పందిస్తూ.. యూరియా కొరతకు కేంద్రమే కారణమన్నారు. సప్లయ్ లేనప్పుడు డిమాండ్ ఎక్కువ అవుతుందని తెలిపారు. ఉన్న యూరియాను సక్రమంగా ఇవ్వాలనుకోవడం తమ తప్పా అని ప్రశ్నించారు. రైతులు లైన్లో ఉండడం చూడలేకనే ప్రత్యామ్నాయ వ్యవస్థ తెస్తున్నామన్నారు. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ ఎందుకు తెరిపించలేదని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రశ్నించారు. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుల విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన చారిత్రక తప్పిదాలపై అబద్ధాలు ఆపాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యం నుండి కృష్ణా జలాల పంపకాల వరకు బీఆర్ఎస్ నేతలు అనుసరించిన విధానాలు తెలంగాణ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టుగా మారాయని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నేతలు కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు వారి హయాంలోనే కూలిపోయిందని, అటువంటి ఘోర తప్పిదాన్ని సమర్థించుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. రూ. 1.80 లక్షల కోట్లు అప్పు తెచ్చి నిర్మించిన ప్రాజెక్టు నిరుపయోగం కావడం బీఆర్ఎస్ ఘనతేనని, ఈ ప్రాజెక్టు దేశంలోనే అతిపెద్ద కుంభకోణమని కాగ్ కూడా పేర్కొందని ఆయన గుర్తుచేశారు. ఐదేళ్లలో ఈ ప్రాజెక్టు ద్వారా వినియోగించుకుంది కేవలం 70 నుండి 80 టీఎంసీల



నీరు మాత్రమేనని, కేవలం కమిషన్ల కోసమే ప్రాజెక్టు డిజైన్ మార్చారని ఆరోపించారు. కృష్ణా నదీ జలాల పంపిణీ విషయంలో కేసీఆర్, హరీశ్ రావు తెలంగాణకు తీరని అన్యాయం చేశారని మంత్రి విమర్శించారు. 2020లో కృష్ణా బోర్డు సమావేశంలో తెలంగాణకు 33 శాతం నీరు సరిపోతుందని బీఆర్ఎస్ నేతలు రాసివ్వడం వల్లే ఇవాళ ట్రిబ్యునల్ ముందు ఏపీ బలమైన వాదన వినిపిస్తోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే తెలంగాణకు 71 శాతం వాటా కావాలని కేంద్రానికి, ట్రిబ్యునల్‌కు స్పష్టంగా తెలియజేశామని ఆయన వెల్లడించారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం విషయంలో కూడా ఏపీతో కుమ్మక్కై, అపెక్స్ కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేయించుకుని తెలంగాణకు ద్రోహం చేశారని మండిపడ్డారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టును పదేళ్లు అధికారంలో ఉండి ఎందుకు పూర్తి చేయలేదని మంత్రి నిలదీశారు. కనీసం కాలువల తవ్వకం కూడా చేపట్టకుండా, ఒక్క ఎకరానికి కూడా నీరు ఇవ్వకుండా 90 శాతం పనులు పూర్తయ్యాయని అబద్దాలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. కక్షతోనే బ్రాహ్మణ వె÷-లలెంల ప్రాజెక్టును పక్కన పెట్టారని, ఎస్సెల్బీసీ, డిండి వంటి ప్రాజెక్టులను పూర్తి చేయకుండా నల్గొండ జిల్లాకు బీఆర్ఎస్ అన్యాయం చేసిందనిఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసే బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకుంటుందని, బీఆర్ఎస్ నేతలు చేసిన అప్పులకు నెలకు రూ. 16 వేల కోట్లు వడ్డీ కట్టాల్సి రావడం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు సాగునీటి ప్రాజెక్టుల గురించి మాట్లాడే ముందు తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, అక్రమంగా సంపాదించిన సొమ్మును జేబుల్లో నింపుకున్నారని మంత్రి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

# న్యూ సర్పంచ్ సాబ్..జర దేఖో!




హైదరాబాద్:మొన్నటి పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన నూతన సర్పంచ్‌లకు గ్రామాలు సమస్యలతో స్వాగతం పలుకుతున్నాయి. ఏడాదిన్నరగా కేంద్రం నుంచి నయా పైసా రాకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు ఆగిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం సైతం గ్రామాలకు నిధులు కేటాయించ లేదు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులకు తోడు హరితహారం, స్మశాన వాటికల నిర్మాణం వంటి కొన్ని పనులను విధిగా చేయాలని అధికారులు పాత సర్పంచ్‌లపై ఒత్తిడి చేశారు. దీనితో అనేక గ్రామాల్లో సర్పంచ్‌లు, కార్యదర్శులు సొంత డబ్బులు, అప్పులు తెచ్చి ఆ పనుల్ని పూర్తిచేశారు. వాటికి సంబంధించి దాదాపు రూ.వెయ్యి కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కొత్తగా ఎన్నికైన సర్పంచులు గ్రామాభివృద్ధిపై దృష్టి పెట్టాలా లేక పాత సర్పంచ్‌లకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు, కార్యదర్శులు చేసిన అప్పులను సమన్వయం చేసుకోవాలో తేల్చుకోవాల్సిన పరిస్థితులు క్షేత్రస్థాయిలో ఉన్నాయి.

గుదిబండగా 2018 చట్టం


2018 పంచాయతీరాజ్ చట్టం సర్పంచ్‌లకు గుదిబండగా మారనుంది. గ్రామంలో పన్నులు వసూలు కాకపోయినా సర్పంచ్‌నే బాధ్యుణ్ని చేస్తున్నారు. ఈ చట్టం వారికి అధికారాలు ఇవ్వకుండా, బాధ్యతలనే ఇచ్చింది. కొన్ని బాధ్యతలు నిర్వర్తించని సర్పంచ్‌లను పదవుల నుంచి సస్పెండ్ చేసే అధికారాన్ని కలెక్టర్లకు కట్టబెట్టారు. గతంలో కూడా సస్పెన్షన్ ఉండేది. కానీ, ఇప్పుడు కారణాలు పెరిగాయి. ఈ చట్టం ఆ బాధ్యతల గురించి చెప్పింది తప్ప, ఆ బాధ్యతలు పూర్తి చేయడానికి అధికారం, డబ్బు ఎలా వస్తాయనేది మాత్రం స్పష్టం చేయలేదు. ఇప్పటి వరకూ తెలంగాణలో 47 మంది సర్పంచ్‌ల సస్పెండ్ అయ్యారు. 200 మంది ఓటర్లు, 300 జనాభా ఉన్న పల్లెలను కూడా పంచాయితీలు చేశారు. ఆ పంచాయితీ ఏడాది మొత్తం ఆదాయం కలిపినా రానంత డబ్బును, ఆ పంచాయితీ అభివృద్ధి కోసం సర్పంచ్ ఎక్కడి నుంచి తెస్తాడు? వీధి దీపాల కరెంటు బిల్లులు కూడా కట్టుకోలేని పంచాయితీలు, లక్షల రూపాయలు పెట్టి స్థలాలు కొనలేవు. ఈ కొత్త నిబంధనల వల్ల కొత్తగా సర్పంచ్‌లుగా ఎన్నికై, ఆర్థికంగా బలం లేని దళితులు, పేదలు, మహిళా సర్పంచ్‌లే ఇబ్బంది పడతారనే అంచనాలు ఉన్నాయి.

భారంగా హరితహారం

హరిత హారం కార్యక్రమం కింద స్థలాలు వెతకడం, మొక్కలు పెంచడం కొత్త సర్పంచ్‌ల బాధ్యత. ఇదే ఇప్పుడు వారికి భారంగా మారుతోంది. ఈ పథకం కింద నాటిన మొక్కల్లో 85 శాతం బతక్క పోతే, దానికి సర్పంచ్‌లనే బాధ్యుల్ని చేస్తారు. నెల రోజుల్లో శ్మశాన వాటిక లేదా డంపింగ్ యార్డ్ లాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని అధికారులు ఆర్డర్లు వేస్తారు. వాటికి సంబంధించిన నిధులు ఇవ్వరు. స్థలాలు గుర్తించరు. స్వయంగా సర్పంచ్, కార్యదర్శి వాటిని గుర్తించి చేపట్టాలి. గ్రామానికి చెందిన ఖాళీ భూములు ఎక్కడ ఉన్నాయో రెవెన్యూ విభాగం చెప్పదు. గత సర్పంచ్‌లను ఈ మూడు పథకాలు అప్పుల పాలు చేశాయి.

కొత్త సర్పంచ్‌లు, వార్డు సభ్యుల బాధ్యతల స్వీకరణ..ప్రత్యేక గ్రాంట్ ఇవ్వాలి పాతబకాయలు తీర్చడానికే మాకు రెండేండ్లు పడుతుంది. ప్రభుత్వం ప్రత్యేక నిధులు ఇవ్వకపోతే గ్రామపంచాయతీల నిర్వహణ కష్టమే. పంచాయతీ కార్యదర్శులకు, మాజీ సర్పంచుల బిల్లుల కోసం రూ.10 లక్షలు కావాలి. కేంద్ర, రాష్ట్ర నిధులతోపాటు రూ.10 లక్షల ప్రత్యేక గ్రాంట్ ఇవ్వాలి. - వామన్‌గౌడ్, సర్పంచ్, నడిగడ్డ, నాగర్ కర్నూల్ జిల్లా

# ఉగాదికి నంది నాటకోత్సవాలను నిర్వహించే ఆలోచన



అమరావతి,వచ్చే ఉగాది నాటికి ఆంధ్రప్రదేశ్‌లో నంది అవార్డులతో పాటు, నంది నాటకోత్సవాలను నిర్వహిస్తామని రాష్ట్ర సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. వీటిని తిరిగి అత్యంత వేడుకగా నిర్వహించాలన్న ఆలోచనతో ప్రభుత్వం ఉందన్నారు. ఈ వేడుకలు నిర్వహించేందుకు సీఎం చంద్రబాబు కూడా సుముఖంగా ఉన్నారని తెలిపారు. అమరావతిలో 'ఆవకాయ్' ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా దుర్గేశ్ ప్రకటించారు. జనవరి 8 నుంచి 10 వరకు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలుగు సినిమా సాహిత్యం, కవిత్వం, సంగీతం, నృత్య విభాగాల్లో ఈ వేడుకలు ఉండనున్నాయి. కృష్ణానదీ తీరం పున్నమి ఘాట్, భవానీ ద్వీపంలో వీటికోసం ఏర్పాట్లు చేయనున్నారు. ఈ సందర్భంగా ఉత్సవాల పోస్టర్‌ను మంత్రి కందుల ఆవిష్కరించారు. అనంతరం సినీ పరిశ్రమ గురించి విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఏపీలో షూటింగ్ జరుపుకొనే చిత్రాలకు ప్రభుత్వం నుంచి మరింత సహకారం ఉంటుంది. నంది అవార్డులు.. నంది నాటకోత్సవాలు జరగాలి. నాటకాన్ని సినిమానూ సమానంగా చూడాలని సీఎం పలుమార్లు చెబుతున్నారు. చిత్ర పరిశ్రమలోని సమస్యల పరిష్కారానికి త్వరలో సినిమాటోగ్రఫీశాఖ ఓ సమావేశం నిర్వహించనుంది. కొత్త సినిమాలు విడుదలైనప్పుడు ఏ రకమైన ఆలోచన చేయాలి? వాళ్ల ఇబ్బందులను తొలగించాలన్న దానిపై ఇందులో మాట్లాడతాం. ఈ సమావేశంలో సినీ పరిశ్రమ వర్గాలేవీ పాల్గొనడం లేదు. వారితో మరోసారి సమావేశం నిర్వహించి, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వారికి వివరిస్తామని మంత్రి దుర్గేశ్ వివరించారు. బడ్జెట్‌ను బట్టి సినిమాకు సహకారం అందించాలని ఒక ఆలోచన ఉంది. అలాగే ఏపీలో షూటింగ్ చేసిన సినిమాలకు ఇంకొంత సపోర్ట్ చేయాలి. థియేటర్ల నుంచి ఆదాయం తగ్గుతోంది కాబట్టి, ప్రస్తుతం ఉన్న విధి విధానాల ప్రకారం అత్యధిక బడ్జెట్ సినిమాలకు సహకారం అందిస్తున్నాం. ఇక్కడ రెండు వాదనలు ప్రధానంగా వినిపిస్తున్నాయి. నటీనటుల పారితోషికం కాకుండా సినిమా బడ్జెట్ ఎక్కువగా ఉంటే ఆ సినిమాకు సహకారం ఇవ్వాలని ఒక వాదన నడుస్తోంది. నటీనటులు, సాంకేతిక నిపుణులకు పారితోషికంతో కలిపితే సినిమా బడ్జెట్ అవుతుందన్న మరో వాదన కూడా ఉంది. ఈ రెండింటికీ మధ్యే మార్గంగా ఎలా చేస్తే బాగుంటుందని ఆలోచిస్తున్నాం. దీనిపై ఓ నిర్ణయం తీసుకుంటాం. ఏపీలో ఎక్కువగా షూటింగ్ సినిమాలపై ప్రత్యేకంగా దృష్టి పెడతాం అని మంత్రి వివరించారు.

# గుండెపోటు కాదు...భర్తను హత్య చేసి గుండెపోటుగా చిత్రీకరణ

మేడ్చెల్,మేడ్చల్ జిల్లా మేడిపల్లి బృందావన్ కాలనీలోని ఓ ప్లే స్కూల్‌లో డిసెంబర్ 12న అశోక్ అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. తన భర్త గుండెపోటుతో మరణించాడని భార్య చెప్పడంతో అంతా అదే నిజమని అనుకున్నారు. అయితే పోస్టుమార్టంలో రిపోర్టులో హత్య చేసినట్లు తెలిసింది. దీంతో మృతుడి భార్యను పోలీసులు అదుపులోకి తీసుకుని లోతుగా విచారించగా సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసుల కథనం మేరకు.. అశోక్, పూర్ణిమ దంపతులకు 11 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. సంతోషంగా సాగుతున్న వీరి కుటుంబంలో భార్య కారణంగా సమస్యలు వచ్చిపడ్డాయి. పూర్ణిమ ఇంటి పక్కనే అద్దెకు ఉంటున్న మహేష్ అనే యువకుడితో పూర్ణిమకు ఏర్పడిన పరిచయం.. చివరకు వివాహేతర సంబంధానికి దారి తీసింది. భర్త లేని సమయంలో పూర్ణిమ, మహేష్ కలుసుకునేవారు. అయితే ఇటీవల ఓ రోజు వారి వివాహేతర సంబంధం భర్తకు తెలిసింది. పద్ధతి మార్చుకోవాలంటూ భార్యను పలుమార్లు హెచ్చరించాడు. అయినా పూర్ణిమ తన పద్ధతి మార్చుకోలేదు. ÷రిళిజూ భర్త మందలిస్తుండడంతో చివరకు పూర్ణిమ షాకింగ్ నిర్ణయం తీసుకుంది. ప్రియుడితో కలిసి తన భర్త హత్యకు ప్లాన్ చేసింది. చివరకు ఇద్దరూ కలిసి హత్యకు కుట్ర పన్నారు. ఇద్దరూ కలిసి భర్త మెడకు 3 చున్నీలు బిగించి హత్య చేశారు. తర్వాత మృతదేహాన్ని బెడ్ రూమ్‌లో పడుకోబెట్టారు. తన భర్తకు గుండెపోటు వచ్చి పడిపోయాడని, అశోక్ సోదరికి ఫోన్ చేసి చెప్పింది. సోదరి వచ్చి చూసే సరికి అశోక్.. బెడ్ పై అచేతనంగా పడి ఉన్నాడు. అయితే శరీరంపై దెబ్బలు ఉండటంతో అశోక్ సోదరి ప్రశ్నించింది. బాత్ రూమ్‌లో కింద పడ్డాడు అని పూర్ణిమ కప్పిపుచ్చింది. తర్వాత అశోక్ మృతదేహానికి పోస్ట్ మార్టం జరగకుండా.. పూర్ణిమ అడ్డుకునే ప్రయత్నం చేసింది. మహేష్ కూడా ఆస్పత్రి వద్దకు వచ్చి.. పోస్ట్ మార్టం వద్దు అని అశోక్ కుటుంబ




సభ్యులకు చెప్పే ప్రయత్నం చేశాడు. అయితే పోస్ట్‌మార్టం రిపోర్ట్‌లో వైద్యులు హత్యగా తేల్చారు. పోలీసులు పూర్ణిమను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దశదిన కర్మ జరిగే వరకు పది రోజుల పాటు పూర్ణిమ ఎలాంటి అనుమానం రాకుండా నటించింది. అయితే ఈ 10 రోజుల్లో మహేష్‌తో అనేక సార్లు చాట్ చేసింది. అలాగే మూడు రోజుల క్రితం మహేష్‌తో కలిసి షాపింగ్‌కి కూడా వెళ్లినట్లు విచారణలో తేలింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## బిర్యానీ తిన్న మత్స్యకారులకు ఫుడ్ పాయిజనింగ్

కాకినాడ, కాకినాడ జిల్లా ఉప్పాడ ప్రాంతంలో విషతుల్య ఆహారం కలకలం రేపింది. తీర ప్రాంతానికి చెందిన కొందరు మత్స్యకారులు అస్వస్థతకు గురవ్వడంతో ఈ విషయం వెలుగుచూసింది. ఉప్పాడ తీర ప్రాంతానికి చెందిన 8 మంది మత్స్యకారుల సమూహం ఇటీవల చేపల లోడింగ్ కోసం బైరవపాలెం వెళ్లారు. తిరిగి వచ్చే సమయంలో ఆకలేసి తాళ్లరేవు సమీపంలో గల ఓ హోటల్లో బిర్యానీ ఆరగించారు. ఫుడ్ పాయిజన్ కావడంతో.. అస్వస్థతకు గురై వాంతులు,

# బెల్టు షాపుల బెల్ట్ తీయండి..ఆదాయం కాదు..ప్రజల ఆరోగ్యం ముఖ్యం

అమరావతి,లిక్కర్ ఆదాయం కన్నా ప్రజల ఆరోగ్యం ముఖ్యమని, బెల్టు షాపుల ఊసే లేకుండా చేయాలని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. బెల్టు షాపులపై చంద్రబాబు నాయుడు స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ అధికారులతో సోమవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం చంద్రబాబు పలు కీలక అంశాలపై దిశానిర్దేశర చేశారు. ఆదాయం కాదని.. ఆరోగ్యకరమైన వృద్ధి సాధించాలని వ్యాఖ్యానించారు. లాటరీ విధానం, రిటైలర్ మార్జిన్ పెంపుపై పున:పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతీ మద్యం బాటిల్ పైనా ప్రత్యేక గుర్తింపు నెంబర్ ఉండాలని స్పష్టం చేశారు. బెల్టు షాపుల నియంత్రణకు హర్యానా మోడల్‌పై అధ్యయనం చేస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. మరోవైపు.. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుని ఏపీ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కె. శంకరరావు కలిశారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. తెలంగాణలో బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ శాసనసభలో చట్టం చేసి గవర్నర్ ఆమోదానికి పంపించారని




ప్రస్తావించారు. ఏపీలో కూడా బీసీలకు స్థానిక సంస్థల్లో వారి జనాభా ధామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాకే ఎన్నికలకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. తమ విజ్ఞప్తి పట్ల సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారని శంకరరావు పేర్కొన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com